జలపాతం

జి. నరసింహమూర్తి

"వెళ్లిపోతాను ఆంటీ - ఇంకెప్పుడూ ఇక్కడకు రాను. నాన్నను ఓసారి చూసి వెళ్ళిపోతాను," అంటూ మళ్లీ ప్రాధేయపడింది వసంత.

"అక్కర్లేదు. నీ ఖర్చులకోసం ఇంట్లో ఉన్నదల్లా ఊడ్చి నీ ముఖాన కొడతారు. ఇపుడు పడుతున్న అవస్థలు గాక మళ్లీ ఇదో గోల. వచ్చినదానివి వచ్చినట్టే వెళ్లు." నోటికొచ్చినట్లు మాట్లాడుతోంది అనసూయ.

* * *

కూతురు వసంతంటే గోపాలరావుకి కొండంత ప్రేమ. ఎప్పుడూ ఆమె శ్రేయస్సే కోరుకుంటాడు. తన మనసంతా ఆమె దగ్గరే ఉంటాది. కాని పరిస్థితులటువంటివి.

వసంతను దూరం చేసుకున్నాడు. అది తనకు తప్పలేదు. దాని వెనకాల అగ్నిగుండాలున్నాయి. అగాధాలున్నాయి.

మొదటి భార్య సుగుణకు పిల్లలు కలగడంలేదని రెండుసార్లు ఆపరేషను చేయించాడు డాక్టర్ల సలహామీద. అయినా లాభం లేకపోయింది. మనిషి మొదటి నుంచీ అనారోగ్యంగా ఉండేది. ఈ ఆపరేషన్లవల్లా, తర్వాత ఆరోగ్యంలో

మార్పులు రావడంవల్లా పూర్తిగా జబ్బుకి అంకితం అయిపోయింది.

జబ్బు తీవ్రత పెరిగేకొలదీ పిల్లల మీద ప్రేమకూడా పెరిగిపోయింది సుగుణకు. జీవితాలు ఎడారులుగా మారలేదు గాని పిల్లలమీద ఆశ పోలేదు.

కడకు ఇద్దరి ఇష్టంమీదా వసంతను ఒక ఆయాదగ్గరనుంచి తెచ్చుకున్నారు.

వసంత పెంపకంలో సుగుణ తన జబ్బు మరచిపోయేది. ఆడపిల్లలకు కూడా సంఘంలో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలున్నాయని ఆమె నమ్మింది. వసంతను పెద్ద చదువులు చదివించాలనే కోరిక. ఆమె భవిష్యత్తుమీద భార్యాభర్త లిద్దరికీ ఎన్నో ఆశలున్నాయి

కొంతకాలం తర్వాత సుగుణ మంచాన పడింది. గోపాలరావు అప్పుల్లో పడిపోయాడు. ఆ ఉన్న కొద్ది ఆస్థిమీదా డబ్బు తెచ్చి మందులకోసం ఖర్చు చేశాడు. అయినా భార్య అన్యాయం చేసింది. ఖర్చుతోపాటు కష్టాల్ని కూడా గోపాలరావుకు వదలి ఒకరోజున స్వర్గానికి వెళ్ళిపోయింది ఏడో యేటన పడిన వసంత మాత్రం తనకు మిగిలిపోయింది.

అదే సమయంలో గోపాలరావు అనసూయను ఏరి కోరి పెళ్లాడాడు.

భార్యాభర్తలిద్దరూ అంత అన్యోన్యంగా కాలం గడిపిన తరువాత మరో స్త్రీని పెళ్లాడడానికి గోపాలరావు ఒప్పుకోడని అంతా అనుకున్నారు. కాని, పెళ్లాడాడు. అదీ భర్త వదిలేసిన ఎవరో దూరపు అమ్మాయిని. పోనీ భర్త వదిలేస్తే భయమేమీలేదు. ఆమెకు ఇద్దరు పిల్లలున్నారు. పెద్దపిల్ల మూగది. పిల్లోడు పుట్టగుడ్డి.

కోరి ఈ సంత నెత్తినెందుకు వేసుకున్నాడు?

కొరగాని ఆదర్శాంతో మూగపిల్లనీ, గుడ్డి కుర్రోన్నీ గొంతుక్కి ఎందుకు వేలాడేసుకున్నాడు? ఎవరికీ తెలియదు. ఎంత అభ్యుదయ భావాలున్నవాడయినా ఇటువంటి త్యాగాన్ని గొంతుక్కి బిగించుకోడు.

అది వయస్సు పెట్టిన తొందరన డానికి కూడా లేదు. అతనికి ఒకవిధంగా అది పెళ్లాడవలసిన వయస్సు కూడా కాదు. కాని అంతా అయిపోయింది. గోపాలరావు జీవితంలో చిత్రంగా మరో స్త్రీ ప్రవేశించింది.

అనసూయ తన ఇంట్లో అడుగు పెట్టినప్పుడు కూతురు వసంతని చూపిస్తూ "ఈ బిడ్డకూడా నీ బిడ్డే అనసూయా!" అన్నాడు. అప్పుడు ఆమెలో కనిపించిన విముఖతా, ఈర్ష్యా తను, ఎన్నటికీ మరువలేడు. ఆ రోజూ, ఆ ఘటనా అతనిలో ముద్రపడిపోయింది. ఆశించిందీ, అనుకున్నదీ తలక్రిందులైంది. తన గుండెల్లో దాచుకున్నవన్నీ లోయల్లోకి త్రోసేశాడు.

గోపాలరావుకి ఇంతవరకూ వసంత

బాధ్యత మాత్రమే ఉండేది. ఇప్పుడు మరో ఇద్దరు పిల్లల్ని పెంచాలి. భార్యను పెంచాలి. ఆర్థికసమస్యలు అతన్ని వేటాడుతున్నాయి. వాటినే తిరిగి వేటాడకపోతే మనిషి మనుగడ రూపు మాసిపోతుంది.

సంపాదించాలి. కుటుంబాన్ని పోషించాలి. ఎన్నో ప్రయత్నాలు చేసాడు. కడకు ఓ కలపదుకాణం అతన్ని చిన్న గుమాస్తాగా స్వీకరించింది. నీ సంసారం కొండంతయినా నా జీతాన్ని మాత్రం గులకరాడుకి మించి ఇవ్వనంది!

గోపాలరావుకి ఇంకెక్కడా దగ్గర్లో అంతకంటే మంచి పని దొరకలేదు. రాజీపడి మెడ దించుకున్నాడు. నవ్వుతూ నడుం వంచాడు.

కొంత కాలం గడిచింది.

గోపాలరావు సాయంత్రం యింటి కొచ్చేసరికి అనసూయ వసంతమీద కేకలేస్తుంది.

"నన్ను అమ్మా అన్నావంటే నీ గొంతు నులిమేస్తాను. నీకు నేనెలా అమ్మనవుతానే దిక్కుమాలినదానా!" అంటూ మళ్లీ బలంకొద్దీ కొడుతుంది.

గోపాలరావు సిలువవేయబడ్డ క్రీస్తులా అలాగే గోడకి జేరబడిపోయాడు. క్రీస్తుకి చేతులకీ కాళ్లకీ మేకులు కొట్టారు. కాని తన హృదయానికి కూడా మేకులు కొట్టినట్టుంది.

వసంతకు తల్లిప్రేమ కరువవ్వకూడదని కదూ తాను అనసూయను పెళ్లాడింది.

అనసూయ బిడ్డల్ని కన్నది. కాని తక్కిన బిడ్డమీద ఏ కొంచమూ ఆదరణ చూపలేకపోతుంది. ఆమెది మాత్రం హృదయం కాదా?

తాను మాత్రం తండ్రిగా ఆ అంగ వైకల్యం ఉన్న పిల్లల్ని స్వీకరించాడు. ఎందుకని?– వసంత తల్లిగా ఆమె ఆదరిస్తాదనే కదా!

"నన్నెప్పుడైనా అమ్మా అన్నావంటే కొరివికాల్చి వాతలేస్తాను. జాగ్రత్త" అంది జడిపిస్తూ.

"అనను. ఎప్పుడూ అనను." వణికిపోతుంది ఎప్పుడూ ఇటువంటి భయ మెరుగని వసంత

"ఈ సంగతి మీ నాన్నకు చెప్పావంటే తన్ని యీడుస్తాను."

"మరేమనను అమ్మా?"

"ఆంటీ అను. అంతే."

అప్పట్నుంచీ వసంత అనసూయను 'ఆంటీ' అనే అంటూది.

ఇంట్లో వసంతకు అన్యాయం జరుగుతోంది. పసిహృదయం పగిలిపోతుంది. ఈ ఘోరం భరించలేకపోతున్నాడు గోపాలరావు.

వసంత పసిమనసుమీద అనసూయ పొడిచిన పోట్లు పెద్ద పెద్ద గాయాలై పోయాయి. ఆ గాయాల్ని పొడిచినవారే మాన్పాలి. తనకది సాధ్యంకాదు.

గాయపడ్డ ఆమనసు మరిన్ని గాయాలకు గురి కాకుండా చూడాలి. వసంత ఈ నరకంనుంచి బయటికెళ్లిపోవాలి. తన భవిష్యత్తు బంగారుబాట కావాలి. తన కాళ్లమీద తాను నిలబడాలి ప్రయోజకు రాలు కావాలి. సుగుణ వసంత జీతంలో చూడాలన్న వెలుగూ, విలువా ఆను చూపించాలి, ఎలా ?-

ఈ వాతావరణం తనను పెరగ నివ్వదు. అది ఆమెను విరగదీస్తుంది. అంగవిహీనులైన ఈ పిల్లలమధ్య తను పైకి రాలేదు. అన్నీ వున్నా వాళ్లతో పాటు ఓ అంగవిహీనురాలై బ్రతకాలి బ్రతుకు చీకటి చేసుకోవాలి.

గోపాలరావు ఇంకా చాలా లోతు కంటూ వెళ్ళాడు. ఆలోచించాడు. వసంత గతంలో కెళ్ళాడు. ఆపుటలన్నీ పరీక్షిం చాడు. ఈ కుటిల వాతావరణం ఆమె జీవితాన్ని కాల రాసేస్తుంది తన ఆర్థిక సమస్యలు ఆమె పురోభివృద్ధికి కత్తిపోటు.

వసంత వెళ్ళిపోవాలి. దూరంగా వెళ్ళిపోవాలి. తన చదువు తాను చదువు కోవాలి. తన తోవ తాను చూసుకోవాలి. ఆమె ప్రవాహంలా పరుగెత్తాలి. దాని నెవరూ అడ్డుకోరాదు. ఆ అధికారం ఎవరికీ లేదు. దీనికంతకూ ఒకటే పరిష్కారం!

వసంతను తీసుకెళ్ళి దూరంగా ఓ మిషనరీలో చేర్పించేశాడు. వసంతను ఆశీర్వదించమని దేవున్ని వేడుకున్నాడు.

అనసూయ పీడ విరగడై పోయిందనుకుంది. చురుకుగా, తెలివిగా, అందంగా ఉండే వసంతని తన పిల్లల మధ్య చూడడం అంటే అనసూయకు ఒళ్ళుమంట. ఏ అంగవైకల్యమూ లేని ఆ వసంత తన బిడ్డలమధ్య తిరుగు తుంటే ఆమెకు ద్వేషం. సెలవుల్లో ఎప్పు డయినా వసంత యింటికొస్తే అనసూయ ఆమెను రాబందులా పీక్కుతినేది.

ఆటువంటప్పుడు వసంతకు పోయిన తల్లి సుగుణ జ్ఞాపకం వచ్చేది. ఆమె ప్రేమా, ఆదరణా తలచుకుంటే అనసూయ ఆంటీమీద అసహ్యమూ, ఆగ్రహమూ పెరిగిపోయేవి.

ఆ తల్లి ఎక్కడ దొరుకుతుంది తనకు. ఆ అమృతమూర్తిని తన కెవరిస్తారు ?

* * *

వెళ్ళిపొమ్మంటుంది ఆంటీ.

ఒకసారి నాన్నను చూడాలి.

అన్ని శ్రమలనూ ఆనందంగా అనుభ విస్తూ తన భవిష్యత్తును ఇలా తీర్చి దిద్దిన నాన్నను చూసి వెళ్ళిపోవాలి.

తనను మిషనరీ చదివించింది. తల్లిలా పెంచింది. పూనా పంపి అక్కడ తనకు స్టెనోగా ట్రైనింగ్ ఇచ్చింది.

ఇపుడు తనకు ఉద్యోగం కూడా

దొరికింది. తన బతుకు తాను బతక గలదు.

సంసారభారంతోపాటు వయోభారం కూడా మోయలేని గోపాలరావు అప్పుడే అక్కడికి వచ్చాడు.

కళ్ళద్దాలు సరిజేసుకుని వసంతను చూసాడు. చిన్ననాటి వసంత కాదు. పెరిగి పెద్దదయిన వసంత. కూతుర్ని చూసి రెండు సంవత్సరాలయింది. ఆమెలో ఎంతో మార్పు వచ్చింది.

వసంత తండ్రికి నమస్కారం చేసింది.

చినిగిపోయిన బట్టలూ, చిక్కిపోయిన శరీరమూ, క్షీణిస్తున్న ఆరోగ్యమూ చూస్తుంటే ఆమెకు అంతా అర్థ మయ్యింది.

"బాగున్నారా నాన్నా ?" అంటూ ఆప్యాయంగా అడిగింది.

. గోపాలరావు నిట్టూర్చాడు.

ఆ నిట్టూర్పులో ఉన్న బరువే వసంతకు ఓ పెద్ద సమాధానం.

"నీ బాగోగులెప్పుడైనా చూసుకో గలిగానామ్మా ? నాగురించెప్పుడూ ఆలోచించకు."

అలాగే నిలబడిఉంది వసంత.

"గుమ్మంలోనే నిలబడిఉన్నావే తల్లీ, లోనకు నడు" అన్నాడు గోపాలరావు.

గుమ్మంకి అడ్డంగా అనసూయ నిలబడి ఉంది.

మనసులో ఆగ్రహం మనిషినిండా కనబడుతోంది.

లోననుంచి మూగ కూతురూ, గుడ్డి కొడుకూ బయటకు రాబోతుంటే కసిరి లోనకు గెంటింది. వాళ్ళమీద వంకబెట్టి వసంతను తిట్టింది.

వసంతకు లోనకి అడుగు వెయ్యబుద్ధి కాలేదు

"ఒక ముఖ్యమైన విషయం చెప్పి వెళ్ళడాని కొచ్చాను నాన్నా."

"చెప్పు తల్లీ !"

"నాకు ఉద్యోగం వచ్చింది నాన్నా!"

అనసూయ ముఖం తెల్లబడిపోయింది.

"నిన్ను ఆ దేవుడు ఆశీర్వదించాడు తల్లీ," అన్నాడు ఎంతో సంబరపడి పోతూ.

వసంతకు ఉద్యోగం వచ్చిందని విన్న అనసూయలో మరో దుర్బుద్ధి పొడుచు కొచ్చింది. ఆమె సంపాదనమీద ఆశ రేగింది. తనలో స్వార్థం, ఆశా నిండుకున్నాయి.

"లోనకు రా వసంతా !" అంటూ ప్రేమ ఒలకబోసింది.

ఆంటీ కుచ్ఛితం వసంతకు అర్థం కాకపోలేదు.

"నేను లోనకు రావడానికి రాలేదు ఆంటీ - నాన్నను చూసిపోవడాని కొచ్చాను. అంతే."

"అయితే నీ తోవ నువ్వు చూసు కుంటున్నా వన్నమాట."

"అవును ఆంటీ." నిర్భయంగా సమాధాన మిచ్చింది.

ఆమె సమాధానం విన్న అనసూయకు కోపం వచ్చింది.

"ఇంతకాలంగా పాముకి పాలుపోసి పెంచాము."

"పామువి నువ్వు. బిడ్డల్ని గుడ్డులోనే కబళించే విషసర్పానివి నువ్వు

అనసూయా," అంటూ కోపంతో రెచ్చిపోయాడు గోపాలరావు.

గోపాలరావు ఎందుకలా అన్నాడో అనసూయకు అర్థంకాలేదు.

"ఏ పాపాత్మురాలో పడేసినదాన్ని తెచ్చి ఇంత పెద్దదాన్ని చేస్తే కడకు ఆ పాడుబుద్ధులే చూపించింది."

గోపాలరావులో సహనం చచ్చిపోయింది. ఎంతోకాలంగా గుండెల్లో దాచుకుంటూ వస్తున్న ఆ అగ్నిగోళం బద్దలవడానికి సిద్ధమవుతుంది, కాని బలవంతంగా అదంతా తనలోనే దిగమింగుకోవాలనుకుంటున్నాడు.

"అనసూయా! నాకు కోపం రప్పించకు వెళ్ళు, లోనకెళ్ళు."

"ఇంతకాలమూ, ఈ యింట్లో తిని, ఈవేళ ఉద్యోగం దొరకడంతో తన తోవ తాను చూసుకుంటున్న మీ ముద్దుల కూతురుమీద కోపం రావడంలేదా?"

"అదంతా నా యిష్టం. నా కూతురు సుఖమే నేను కోరుకునేది."

"హుం, మీకో కూతురూ, దానికో సుఖమూను. అసలు దానికి మీరెలా తండ్రయ్యారు? ఎవడికో దానమ్మ కని వీధిలో పడేసిపోతే దాన్ని తెచ్చి ఈ యింటి గౌరవం గంగపాలు చెయ్యాలనుకున్నారు. పోనీయండి. ఇటువంటి దుందే నా పిల్లల పరువు కూడా బుగ్గిపాలవుతుంది."

"అనసూయా! నీ కళ్ళు మూసుకుపోయి మాట్లాడుతున్నావు."

గోపాలరావు ఆవేశం పగ్గాలు తెంచుకుంటోంది.

"నా కళ్ళు కాదు మూసుకుపోత, మీ కూతురు కళ్ళు. అసలు దీన్నసి యేం లాభంలే, దీన్ని కన్నదాన్ని అనాలి."

అతని గుండెల్లో దాచుకుంటూ వస్తున్న ఆ అగ్నిగోళం ఒక్కసారి బద్దలయింది.

"అను. నీ యిష్టం వచ్చిన
ఈ వసంతను కన్నది ఎవరో నువ్వు చూడాలనుకుంటున్నావా? ఎవరో కాదు. ఆ నీచురాలు ఎక్కడో లేదు. నేను నిజం చెబుతాను. నా కూతురు వసంతవల్ల నీ యింటి గౌరవం గంగపాలు కాకూడదు. నీ పిల్లల పరువు బుగ్గిపాలవకూడదు. అందుకే చెబుతున్నాను.

—నువ్వెవరివో, నీ గతజీవితం ఏమిటో నాకు తెలియదనుకున్నావా అనసూయా? హుం నాకంతా తెలుసు. నేను ఏ రహస్యమూ దాచుకోనవసరం లేదు... నీ భర్త చలపతిరావు ఉద్యోగ రీత్యా దూరంగా ఉన్న సమయంలో మరెవడికో గర్భం దాల్చావు. ఈ సంగతి అతనికి తెలియకుండా రహస్యంగా మరోచోటుకెళ్ళి రంగమ్మ అనే ఆయా దగ్గర పురుడు పోసుకుని ఆ బిడ్డను అక్కడే వదిలేసి వెళ్ళిపోయావు. అవునా? ఆ ఆయాదగ్గరనుంచే మేము